ఆదివారం ప్రత్యేకం



ఉరకలేస్తున్న లింగాపూర్ మండలంలోని మిట్టే జలపాతం

ప్రకృతి సిగలో జల సోయగం

ప్రకృతి అందాల్లో జలధారల ప్రత్యేకతే వేరు. అలాంటి నిలువెత్తు నీటి సౌందార్యాన్ని ఆస్వాదించాలంటే జలపాతాలను మించిన మార్గం లేదు. ఆ తెల్లని నీళ్ల సిరులను కళ్లకు హత్తుకోవాలంటే మాన్‌సూన్‌ని మించిన సీజన్ లేదు. మిగిలిన అన్ని కాలాల్లోనూ పాడిపాడిగా, సాదాసీదాగా కనిపించే ప్రాంతాలు.. వర్షాకాలంలో మాత్రం హర్షామోదాల కేరింతల నిలయాలుగా మారిపోతాయి. ఈ సీజన్‌లో నప్పే ట్రిప్స్‌గా జలధారల దారి పట్టేవారి కోసం జిల్లాలో అందుబాటులో ఉన్న కొన్ని జలపాతాల విశేషాలివి..



తిర్యాణి మండలంలోని చింతలమాదర జలపాతం

- జాలువారుతున్న నీటి సవ్వడులు
- కొండకోనల్లో జలపాతాల గలగలలు
- అబ్బురపరుస్తున్న ఆహ్లాదకర వాతావరణం
- ఆస్వాదిస్తున్న పర్యాటకులు
- రవాణా, మౌలిక వసతుల లేమితో మరుగున పడుతున్న వైనం

ఆసిఫాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన జలపాతాలు ఆకట్టుకుంటున్నాయి. జిల్లాలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు అటవీ ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన జలపాతాలు జాలువారుతూ జలకళను సంతరించుకోవడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. దీంతో జలపాతాల సందర్శనకు వచ్చే సందర్శకులు తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రకృతి సోయగాల ఆసిఫాబాద్ జిల్లా అటవీ ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం ఏ మాత్రం ఆదరణ చూపినా తెలంగాణ కాశ్మీర్‌గా ఘన తకెక్కిన ఈ ప్రాంతం పర్యాటక శోభను సంతరించుకుంటుందనడంలో ఎలాంటి సందేహం అక్క ర్లేదు. పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతంలో అభివృద్ధి వేగవంతం కావడంతో పాటు ఉపాధి అవకాశాలు లేక దుర్భర జీవితాలను గడుపుతున్న అడవి బిడ్డల ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా అరుకు లోయను మించి పర్యాటకులను ఆకర్షించే అద్భుతమైన వింతలు, విశేషాలు ఈ ప్రాం తంలో నిండుగా ఉన్నా వెలుగుకు నోచుకోకుండా ఉన్నాయి. అలాంటి ప్రదేశాలను అభివృద్ధి చేసి ప్రాచుర్యం కల్పిస్తే రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులను ఆకర్షించవచ్చు.

పచ్చని గుట్టలు..

చుట్టూ ఎత్తైన పచ్చని గుట్టలు... పక్షుల కిలకిలరావాలు.. గలగల పారే సెలయేటి సవ్వళ్లు.. గుట్టల మీది నుంచి కిందికి జాలువారుతున్న నీటి సెలయేర్లు ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే విధంగా పర్యాటకులను మనసుకు హద్దుకునే జలపాతాలు. పర్యాటక ప్రేమికులకు కనబడకుండా అటవీ తల్లి ఒడిలో ఎన్నో జలపాతాలు జిల్లాలో విరివిగా ఉన్నాయి. ఈ దృశ్యాలు ఓ అద్భుతం. అది ఒక ప్రకృతి సోయగం. ఇలాంటి సుందర క్షేత్రాలకు ఆదరణ కొరవడడంతో బాహ్యప్రపంచానికి ఈ అందాల జలపాతాల సోయగాలు పర్యాటక ప్రేమికులకు తెలియకుండా మరుగున పడిపోతున్నాయి. ప్రభుత్వం ప్రకృతి ఒడిలో దాగి ఉన్న ఈ అందాల జలపాతాలను గుర్తించి పర్యాటకంగా అభివృద్ధి పరిచినట్లయితే పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లనున్నాయి.

నీటి సెలయేళ్లు ఇవే..

ఆసిఫాబాద్ మండల కేంద్రం నుంచి 30 కిలోమీటర్ల దూరంలో సమితులగుండం జలపాతం ఉంది. లింగాపూర్ మండలంలోని పిట్టగూడ, లింగాపూర్ గ్రామాల మధ్య ఉన్న మిట్టే జలపాతం సందర్శకులను కనువిందు చేస్తున్నది. సిర్పూర్(యూ) మండలంలోని ఎత్తైన గుట్టల నుంచి జాలువారే కుండాయి జలపాతం ప్రకృతి రమణీయతను చాటుకుంటుంది. తిర్యాణి మండలంలోని గుండాల, చింతలమాదర, ఉల్లిపిట్ట గ్రామాల సమీపంలో గుండాల, చింతలమాదర,ఉల్లిపిట్ట జలపాతాలు, వాంకిడి మండలంలోని సర్కెపల్లి గ్రామ సమీపంలోని బుగ్గ జలపాతం ప్రకృతి రమణీయతకు ఉట్టి పడేలా కనువిందు చేస్తున్నాయి. కెరమెరి మండలంలో బాబేఝరి, కల్లెగాం గ్రామాల సమీపంలో, పెంచికల్‌పేట మండలంలోని కొండెంగా లొద్ది జలపాతాలు జాలువారుతున్నాయి.



జాలువారుతున్న ఆసిఫాబాద్ మండలంలోని సమతుల గుండం జలపాతం

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి..

\- పత్తి హరిప్రసాద్, ఆసిఫాబాద్



జిల్లాలో ప్రకృతి రమణీయతకు సజీవసాక్షాలుగా నిలుస్తున్న జలపాతాలను పర్యాట కంగా అభివృద్ధి చేయాలి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో బాహ్య ప్రపంచా నికి తెలవకుండా ఎన్నో జలపాతాలు జిల్లాలో ఉన్నా యి. పర్యాటక ప్రేమికులను వీటిని ఆస్వాదించేందుకు అనువైన సౌకర్యాలు లేక పోవడంతో మరుగున పడుతున్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చేసినట్లయితే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు పర్యాటకుల తాకిడి పెరుగనుంది.

సీఆర్టీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అధికారులు సీఆర్టీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శనివారం పరీక్షల ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు, పరిశీలకులు, సెట్టింగ్ స్క్వాడ్, రూట్ అధికారులు, ఇన్విజిలేటర్లతో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్(సీఆర్టీ) పోస్టులకు నిర్వహించే పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని, సుమారు 1,137 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాలు పోలీసు బందోబస్తు మధ్య పరీక్షా కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దని, పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్, డీఎంహెచ్‌వో సీతారాం, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, ఇన్‌చార్జి విద్యాధికారి ఉదయ్‌బాబు, మున్సిపల్ కమిషనర్ గజానన్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జైనూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఉషేగాం పీహెచ్‌సీ వైద్యాధికారి రాజు అన్నారు. స్థానికంగా శనివారం ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు వ్యాధులు ప్రబలినప్పుడు వెంటనే వైద్యం కోసం రావాలని సూచించారు. డ్రమ్ములు, పాడైన కుండలలో వర్షపు నీరు ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శనివారం ఉషేగాం పీహెచ్‌సీలో సుమారు 50 మంది రోగులకు వైద్యం అందించామని వైద్యాధికారి రాజు తెలిపారు.

పరిశీలించి.. సూచనలు చేసి



కుమరం భీం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్‌ఈ కుమారస్వామి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కొంత కాలం క్రితం దెబ్బతిన్న కుమరం భీం ప్రాజెక్టు ఎర్త్ బండ్‌ను శనివారం ఎస్ఈ కుమారస్వామి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎర్త్ బండ్ దెబ్బ తినడంతో హెవీ ఫ్లడ్ వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు వివరించారు. ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట ఈఈ గుణవంతరావు, ఏఈ ప్రశాంత్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాతా

వాంకిడి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటగూడ గ్రామంలో శనివారం సీజనల్ వ్యాధులపై కళాజాతా ప్రదర్శణతో ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులపై పాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి బృందం సభ్యులు బాపు, మోహన్‌నాయక్, పురుషోత్తం, సోమశేఖర్, శిరీష, వెన్నెల, అన్నపూర్ణ, మెంగోరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



నివాళులు అర్పిస్తున్న బీఎస్‌ఐ, సమతాసైనిక్ సభ్యులు

వాంకిడి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో శనివారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన వీర జవాన్లకు నివాళులు అర్పించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్, సమతా సైనిక్ దళ్ నాయకుడు సందీప్, శ్యాంరావు, రోషన్, శ్రీనివాస్, విఠల్, భీంరావు, పెంటు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధమండల దీక్షల స్వీకరణ

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో 50 మంది భక్తులు అర్ధమండల దీక్షలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకుడు శిరీష్ శర్మ, శ్రీనివాస్ శర్మల ఆధ్వర్యంలో గణపతిపూజ, నవగ్రహపూజ, అంజనేయస్వామికి రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామ పూజ అనంతరం మాలదారణ చేపట్టారు. దీంతో ఆలయ ప్రాంగణం కాషాయమయంతో జై శ్రీరామ్ జై హనుమాన్ నామస్మరణతో మారుమ్రోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకన్న, వెంకటేశ్వర్లు, వివేక్, శ్రీనివాస్, నారాయణమూర్తి, మధు, లక్ష్మణ్‌మూర్తి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్వులు సవరించాలి

ఆసిఫాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పని సర్దుబాటు(వర్క్ అడ్జస్టమెంట్) ఉత్తర్వులు సవరించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో వివిధ పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలకు కేటాయిస్తారని తెలిపారు., సీనియర్ ఉపాధ్యాయులు అవకాశం ఇస్తూ జూనియర్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

దహెగాం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ మిషన్ భగీరథ ఆపరేటర్లు, హెల్పర్లు, పంంపు ఆపరేటర్లు మిషన్ భగీరథ డీఈ పృథ్వీరాజ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

2న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద ప్రాతిపదికన గౌరవ వేతన పద్ధతిలో బోధన సిబ్బంది పోస్టులను భర్తీ చేసేందుకు ఆగస్టు 2న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి శనివారం ఒక ప్రకటలో తెలిపారు. మొత్తం 22 విభాగాలలో 13 ప్రొఫెసర్, 26 అసోసియేట్ ప్రొఫెసర్, 63 అసిస్టెంట్ ప్రొఫెసర్, 48 సీనియర్ ప్రెసిడెంట్ పోస్టులను భర్తీ చేయనున్నామని తెలిపారు.

రేషన్ కార్డులు మంజూరు

జైనూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో 913 కొత్త రేషన్ కార్డులు మంజూర య్యాయని తహసీల్దార్ ఆడ బీర్షావ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త రేషన్ కార్డులను 1వ తేదీన స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు.

నేరాలను నియంత్రించాలి



మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో శనివారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో నేరాలను నియంత్రించడానికి తీసుకుంటున్న చర్యలు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు ఎస్పీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా అవసరాలకు అనుగుణంగా పోలీసు శాఖ పారదర్శకంగా సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందేలా ముందుకు సాగాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పని చేయాలని చెప్పారు. నిఘా వ్యవస్థకు ప్రధాన సంపత్తిగా మారిన సీసీ టవల వల్ల భద్రతా ప్రమాణాలు పెరుగుతున్న క్రమంలో నేను సైతం, కమ్యూనిటీ పోలీసింగ్, సీసీ కెమెరాల ఏర్పాటును మరింత ప్రోత్సహించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. నేరం చేసిన వాడికి శిక్ష పడాలి, నేరం చేయని వారికి రక్షణగా ఉంటూ సమర్థ సేవలు ప్రజలకు అందాలన్న సంకల్పంతో పోలీసు శాఖ లక్ష్యంగా పని చేయాలన్నారు. మహిళ భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన, సత్వర సేవలు అందించలన్నారు. కేసుల్లో విచారణ వేగవంతం పూర్తి చేసి చార్జీషీట్ దాఖలు చే యాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవసరమైన అన్ని రకాల భద్రత ప్రమా ణాలు పాటించాలని సూచించారు. కార్యక్ర మంలో ఏఎస్పీ చిత్తరంజన్, డీసీఆర్బీ డీఎస్పీ విష్ణుమూర్తి, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద బందో బస్తు

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే లైసెన్స్ సర్వేయర్స్, గ్రామ పాలన ఆఫీసర్స్(జీపీవో), సీఆర్టీ పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ బందో బస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైసెన్స్ సర్వేయర్ పరీక్ష ఉంటుందన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాజీ వీఆర్‌వో, వీఆర్‌ఏలకు గ్రామపాలన ఆఫీసర్స్(జీపీవో) పరీక్ష, ప్రభుత్వ ఆశ్రమ బాలుర హైస్కూల్, ప్రభుత్వ ఆశ్రమ బాలుర హైస్కూల్‌లలో సీఆర్టీ ఎస్‌జీటీ పరీక్షా ఏంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దని, పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని తెలిపారు.

చదువుతో ఉన్నత శిఖరాలు

తిర్యాణి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని ఎస్సై శ్రీకాంత్, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీఈవో అంటోనీ రెడ్డి అన్నారు. తిర్యాణి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీలో శనివారం విద్యార్థులకు, ప్రజలకు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడేతూ చదువుతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. చదువుకుంటే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహభావంతో మెలిగి వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కరించాలన్నారు. ఆడ పిల్లలకు 18 ఏళ్లు నిండిన తరువాతనే పెళ్లి చేయాలని చెప్పారు. యువతీ యువకులు ప్రేమలంటూ కాలయాపన చేసి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో సెర్ప్ ఉద్యోగులు రవీందర్, సరిత, లింగన్న, ఎంపీడీవో మల్లేష్, సీపీడీవో తిరుపతమ్మ, డాక్టర్ పల్లవి, నాయకులు వినోద్, బాదిరావు, మోతిరాం, సంతోష్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.


జిల్లాలో ముసురు వాన



గూడెం శివారులో పత్తి చేనులో పేరుకుపోయిన ఇసుక మేటలు

ఆసిఫాబాద్/చింతలమానేపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి ముసురు వాన కురుస్తోంది. ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కుమరం భీం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరడంతో ఒక గేటు ఎత్తి కిందికి వదులుతున్నారు. చింతలమానేపల్లి మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్లు పూర్తిగా అస్తవ్యస్తం కాగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంటలు నీట మునిగాయి. శనివారం సాయంత్రం వర్షం తగ్గింది. మూడు రోజు లుగా దిందా గ్రామస్థులకు రాక పోకలు నిలిచి పోయాయి. శనివారం సాయత్రం వాగు ప్రవాహం తగ్గడంతో గ్రామస్థులు బయటకు వెళ్త న్నారు. ఖర్జవెల్లి నుంచి గూడెం వరకు ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయం కావడంతో పాటు బురదమ యంగా మారింది. గూడెం- కోయపల్లి రద్దు పూర్తిగా ధ్వంసమైంది. కోయపల్లి నుంచి బెజ్జూరు వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. లింగాపూ ర్‌లో 9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తిర్యాణిలో 8.5, సిర్పూర్(టి), కెరమెరి మండలాల్లో 5.3, బెజ్జూరు, పెంచికలపేట, కౌటాల మండలాల్లో 5.0, జైనూరులో 4.5, కాగజ్‌నగర్‌లో 4.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

జీవో 49ని శాశ్వతంగా రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్

దహెగాం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జీవో 49ని శాశ్వతంగా రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ డిమాండ్ చేశారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమరం భీం కన్జర్వేషన్ రిజర్వు పేరుతో తీసుకు వచ్చిన జీవో 49ను ప్రజాపోరాటాలకు తలవంచిన రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసిందని చెప్పారు. దానిని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా హక్కు పత్రాల కోసం పోరాటం చేస్తున్న ఆదివాసీలకు పత్రాలు అందజేయాల న్నారు. కాగజ్‌నగర్- దహెగాం డబుల్ రోడ్డును వెంటనే నిర్మించాలని, కాగజ్‌నగర్ నుంచి దహెగాంకు బస్సు నడిపించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, అశోక్, బక్కనన, కమల, తార, నర్సింహులు, పున్నపు రెడ్డి, రాకేష్, లక్ష్మి పాల్గొన్నారు.

భూ భారతి అర్జీలపై సర్వే

సిర్పూర్(టి), జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన భూ భారతిలో వచ్చిన దరఖాస్తులపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేసేందుకు శనివారం ఎంఆర్ఐ, గిర్దావర్‌లు మండలంలోని వెంకట్రావుపేట, సిర్పూర్(టి)లో మోకాపై భూముల కొలతలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీలు పెట్టుకున్న వారిని అక్కడికి పిలిపించి వారి సమక్షంలో వివరాలు నమోదు చేశారు. నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ స్వప్న, ఎంసీ ప్రసాద్, చైన్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన అప్పు అడిగితే కత్తితో దాడి

● తప్పిన ప్రాణాపాయం ● దాడి చేసిన వారిపై కేసు


గాయపడ్డ శివరాం

కాసిపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అవసరానికి అప్పు ఇచ్చి తిరిగి అప్పు చెల్లించాలని అడిగినందుకు కత్తితో దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి కోమటిచేనులో చోటు చేసుకుం ది. బాధిత కుటుంబ సభ్యులు కాసిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోమటి చేనుకు చెందిన రాంటెంకి శివరాం కొంతకాలంగా కోమటిచేను ప్రధాన రహదారి పక్కన చికెన్ సెం టర్ నిర్వహిస్తున్నాడు. అదే గ్రామా నికి చెందిన జాడి రవి మూడేళ్ల క్రితం శివరాం వద్ద రూ. 9వేలు అప్పుగా తీర్చుకున్నాడు. అప్పు అడిగిన ప్రతిసారి వాయిదాలు వేయడంతో విసిగిపోయిన శివరాం రవికి చెందిన ద్విచ క్రవాహనాన్ని రెండు రోజుల క్రితం లాక్కున్నాడు. అప్పు చెల్లించిన తరువాతనే బైక్ ఇస్తానని చెప్పడంతో శివరాంపై కక్ష పెంచుకున్నాడు. శుక్రవారం సాయంత్రం రవి ఆయన కొడుకు అరవింద్ కలిసి శివరాం చికెన్ సెంటర్ వద్దకు వచ్చి ఆయన కోసం ఆరా తీసారు. అక్కడే ఉన్న బొలెరో వాహనంలో ఉన్న శివరాంపై ఒక్కసారిగా రవి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. అప్పటికే అప్రమత్తమైన శివరాం పక్కకు జరగడంతో ప్రాణాపాయం తప్పింది. గమనించిన బం ధువులు శివరాంను హుటాహుటిన మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు జాడి రవి, జాడి అరవింద్‌లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

కారు అదుపు తప్పి ఇద్దరికి గాయాలు


చెట్టును ఢీకొన్న కారు

భీమారం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలం లోని పోలంపల్లి మాంతమ్మ దేవాలయం సమీపంలో శనివారం కారు అదుపు తప్పిన ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానిక ఎస్ఐ శ్వేత తెలిపారు. సంగోజు రామకృష్ణ, కట్ట శాంతిప్రియలు కారులో చెన్నూరు నుంచి మంచిర్యాలకు వెళ్తున్న క్రమంలో పోలంపల్లి మాంతమ్మ దేవాలయం సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో ఇద్దరికి గాయాలైనట్లు తెలిపారు. వీరిని వెంటనే మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడి మృతి


మల్లేష్(ఫైల్)


దహెగాం, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): దహెగాం మండలం ఒడ్డగూడ గ్రామానికి చెందిన ఎల్కరి మల్లేష్ (34) అనే యువకుడు ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి చెందాడు. ఏఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేష్ పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌పై నుంచి కింద పడ్డాడు. వీల్స్ ట్రాక్టర్ మల్లేష్‌పై తిరగడంతో నడుము, కాళ్లు నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేష్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు..


మృతి చెందిన ఆవు

పెంచికలపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట మండలం నందిగాం గ్రామానికి చెందిన మాడే చుక్కయ్య ఆవు శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం మేతకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని అధికారులు స్పందించి పరిహారం ఇవ్వాలని బాధిత రైతు కోరాడు.

అభాగ్యులకు అండ.. అక్రమార్కులకు హడల్



● ఆదివాసీ గ్రామాలకు కాలినడకన ఏఎస్పీ చిత్తరంజన్

● సమస్యలు విని పరిష్కారానికి చర్యలు

ఆసిఫాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న అభాగ్యులకు అపన్నహస్తం అందించడమే కాకుండా అక్రమార్కుల పాలిట సింహస్వప్నంలా విధుల్లో కఠినంగా ఉంటున్నారు ఆసిఫాబాద్ ఏఎస్పీ శ్రీరామోజు చిత్తరంజన్. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆసిపాబాద్ పోలీసు సబ్ డివిజన్‌లో అక్రమార్కులపై కొరడా ఝులిపిస్తున్నారు. వాంకిడి మండలంలోని గోయగాం, చిచ్‌పల్లి గ్రామాల్లో పశువుల అక్రమ రవాణా అడ్డాలపై మఫ్టీలో వెళ్లి మెరుపు దాడులు చేశారు. పశువులు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 320 పశువులను పట్టుకొని కాగజ్‌నగర్ గోశాలకు తరలించారు. ఇంత పెద్ద మొత్తంలో పశువులను పట్టుకొవడం రాష్ట్రంలోనే తొలిసారి. అక్రమార్కు లపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. మానవ అక్రమ రవాణా ముఠాను గుట్టురట్టు చేశారు. యువతి మిస్సింగ్ అధారంగా కేసు విచారణ చేపట్టి మానవ అక్రమ రవాణా ముఠా సభ్యులను పట్టుకు న్నారు. ఈ కేసులో సంబంధం ఉన్న ఆసిపాబాద్, వాంకిడి, మంచిర్యాల, మధ్యప్రదేశ్‌కు చెందిన 10 మంది నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు.

ఇదే కేసులో సంబంధం ఉన్న కానిస్టేబుల్ హరిదాస్‌ను అరెస్టు చేసి సర్వీసు నుంచి శాశ్వతంగా తొలగించారు. అధిక వడ్డీ వసూలు చేస్తూ వ్యాపారాలు చేస్తున్న అక్రమ వడ్డీ వ్యాపారస్తుల ఇళ్లలో సోదాలు నిర్వహించి వారి వద్ద నుంచి బ్లాంక్ చెక్స్, ల్యాండ్ డాక్యుమెంట్లు, బాండ్ పేపర్లు, ప్రామిసరీ నోట్లు, ఏటీఎం కార్డులు, రూ. 11 లక్షల నగదు స్వాధీనం చేసుకొని పది మందిపై కేసులు నమోదు చేశారు. డివిజన్ పరిధిలో నకిలీ విత్తనాల అక్రమ రవాణాను అడ్డుకట్ట వేశారు. రూ. 2 లక్షల 64 వేల విలువ గల 564 కిలోల నకిలీ విత్తనాలను పట్టుకుని 14 కేసులను నమోదు చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు డివిజన్‌లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. గంజాయిని సమూలంగా నిర్మూలించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. ఇప్పటి వరకు 15 కేసుల్లో ఏడు కిలోల గంజాయిని పట్టుకున్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనార్థాలపై గ్రామాల్లో పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఆసిఫాబాద్ పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ట్రాఫీక్ నియం త్రణపై ప్రత్యేక దృష్టి సారించి అతి వేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడిపిన వారిపై సుమారు 200కు పైగా కేసులను నమోదు చేశారు. డివిజన్ పరిధిలో పలు సంఘటనల్లో రౌడీషీటర్లు సస్పెక్టివ్ కేసులు నమోదైనవారు సత్ప్రవర్తనతో మారిన వారిపై ఉన్న కేసులను రద్దు చేశారు. 67 మందిపై ఉన్న కేసులను రద్దుచేశారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి పట్టణంలో 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూంకు అనుసందానం చేశారు. గత ఏడాది డివిజన్‌లో 1,035 కేసులు నమోదయ్యాయి. కాగా ఏఎస్పీగా చిత్తరంజన్ బాధ్యతలు స్వీకరించిన అరు మాసాల్లోనే 1,048 కేసులను నమోదు చేశారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో ..

సామాజిక సేవా కార్యక్రమాల్లో ఏఎస్పీ చిత్తరంజన్ ముందుకు సాగుతున్నారు. ఆదివాసీ గూడాలకు అడవి మార్గం గుండా కాలినడకన వెళుతూ వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. తిర్యాణి మండలంలోని గోవెన, కుర్శిగూడ, నాయకపుగూడ, లింగాపూర్ మండలంలోని చోర్‌పెల్లి, సిర్పూర్(యూ) మండలంలోని రుద్దె కాశ గ్రామాలను సందర్శించి ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలోని ఆదివాసీలకు నిత్యావసర సరుకులు, రగ్గులు, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. తిర్యాణి మండల కేంద్రంలోని పాత పోలీసు స్టేషన్ భవనంలో ఆదివాసీ విద్యార్థులు, యువత ఉన్నత చదువులు అభ్యసించి ఉద్యోగ అవకాశాల్లో మెరుగు పడాలనే లక్ష్యంతో గ్రంథాలయంగా ఏర్పాటు చేశారు. ఇందులో ఫర్నిచర్, పుస్తకాలను సమకుర్చారు.


ఆదివాసీలకు నిత్యావసరాలు అందజేస్తున్న ఏఎస్పీ

వాంకిడిలోని పాత పోలీసు స్టేషన్‌లో చిన్నపిల్లల కోసం కిడ్స్‌జోన్‌ను ఏర్పాటు చేశారు. బాల్యం నుంచే పిల్లలు ఆటపాటలు, వ్యాయామంతో సరదగా గడిపేందుకు వీలు కల్పించారు. డివిజన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు సుమారు మూడు వేల పరీక్షల ప్యాడ్‌లు, పెన్నులు, వాటర్ బాటిళ్లు అందజేశారు.

ఆదాయపన్నుశాఖలో డీడీగా..

ఐపీఎస్ 2022 బ్యాచ్‌కు చెందిన యువ ఐపీఎస్ అధికారి శ్రీరామోజు చిత్తరంజన్ మొదటి ప్రయత్నంలో ఐఆర్ఎస్ సాధించి ఆదాయపన్ను శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఐదేళ్ల పనిచేశారు. ఆ తర్వాత 2022లో సివిల్ పరీక్షల్లో 155వ ర్యాంకు సాధించి ఐఏఎస్ కాదనుకొని యూని ఫాం సర్వీసుపై ఉన్న మక్కువతోనే ఐపీఎస్‌కు ప్రాధాన్యత ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర క్యాడర్‌కు ఎంపికయ్యాడు. అరు నెలల పాటు మహబూబ్ నగర్ జిల్లాలో శిక్షణ ఐపీఎస్‌గా పనిచేశారు. ఈ ఏడాది జనవరి 1న ఆసిపాబాద్ ఏఎస్పీగా బాధ్యతలను స్వీకరించారు.

ప్రజా సేవకే పోలీసులు..

శ్రీరామోజు చిత్తరంజన్, ఏఎస్పీ, ఆసిపాబాద్



ప్రజలకు సేవ చేసేందుకే పోలీసుశాఖ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుంది. ప్రజల సంక్షేమమే పోలీసుల ప్రధాన లక్ష్యం. తప్పు చేస్తే ఎంతటి వారైన శిక్షించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. మాదక ద్రవ్యాల నియంత్రణకు డివిజన్‌లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. గంజాయిని సమూలంగా నిర్మూలించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నాం. ఈ ప్రాంతంలో పని చేయడం ఎంతో సంతోషంగా ఉంది.

సీఆర్టీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న సీఆర్టీ, ఎస్‌జీటీ పరీక్ష నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న పరీక్షా కేంద్రాన్ని శనివారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్టీ ఎస్‌జీటీ పరీక్షను సమర్థవంతంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామని తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి కావాల్సిన మౌలిక వసతుల వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు తరగతి గదిలో పాఠ్యాంశాలను బోధించి వారి పఠన సామర్థ్యాలను పరీక్షించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఇందిరమ్మ ఇంటి పనులకు భూమి పూజ

కాగజ్‌నగర్‌టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సర్దార్ బస్తీలో ఇందిరమ్మ ఇంటి పనులకు మున్సిపల్ కమిషనర్ ఎల్బుల రాజేందర్ శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటాం

పెంచికలపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్ అన్నారు. కమ్మర్‌గాం గ్రామంలో రెండు రోజుల క్రితం చుక్కల దుప్పిని హతమార్చిన ఘనటపై విచారణ చేపట్టారు. హతమార్చిన కేసులో శనివారం అదే గ్రామానికి చెందిన తలండి విగ్నేష్, దుర్గం జలపతి, ఆత్ర బాపు, తలండి బాబురావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని ఎఫ్ఆర్వో తెలిపారు. విచారణలో ఎఫ్ఎస్‌వో జగన్మోహన్‌గౌడ్, అస్మా, ఎఫ్‌బీవోలు విజయలక్ష్మి, సతీష్, అరవింద్‌నాయక్, దీనేష్‌నాయక్, లచ్చన్న, శిరీష పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి


కుళాయిలు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కాగజ్‌నగర్‌టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, రుచికరమైన ఆహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్‌లోని పెట్రోల్ పంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అగ్రోస్ ఫర్టిలైజర్స్, జడ్పీ పాఠశాలను సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలసి శనివారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తాగునీటి కుళాయిలు, తరగతి గదులు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, వంటశాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం ఎల్లాగౌడ్ తోటలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. ఇన్ పేషెంట్, ఔట్ పేషంట్ సేవలు, మందుల అందుబాటు వివరాలు ఆరా తీశారు. మార్కెట్‌లోని మన అగ్రోస్ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. స్రే మందులు, ధరలు, స్టాకు రిజిస్టర్, రసీదు పుస్తకాలు, తదితర వివరాలను పరిశీలించారు. యూరియా కొరత లేకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆయా కార్యక్రమంలో కాగజ్‌నగర్ తహసీల్దార్ మధుకర్, ఏడీఏ మనోహర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కేశవరావు, ఎంఈవో వాసాల ప్రభాకర్, వైద్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

బెజ్జూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జీవో 49ని పూర్తిగా రద్దు చేయాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. తొమ్మిది తెగల ఆదివాసీ ప్రజలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లేష్, శ్రీనివాస్, పుల్లయ్య, మధుకర్, ఆనంద్‌రావు, సతీష్, నగేష్, వెంకటేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): జీవో 49 పూర్తిగా రద్దు చేయాలని కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ దివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల ప్రజా సంఘాల నాయకులు కోవ విజయ్, ప్రభాకర్, సోము శనివారం ఒక ప్రకటనలో కోరారు. పెద్ద సంఖ్యలో ఆదివాసీలు తరలి రావాలని నాయకులు కోరారు.

విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కౌటాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి మధుకర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలను జిల్లా సైన్స్ అధికారి మధుకర్ ఎంఈవో హనుమంతుతో కలిసి శనివారం సందర్శించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి ఆటపాటలతో, కృత్యాధారంగా బోధిస్తున్న ఉపాధ్యాయులను చూసి అభినందించారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారి వెంట ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేశ్వర్, రామాగౌడ్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



సమావేశాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

శ్రీరాంపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్త అవసరమని హైదరాబాద్ రీజియన్-2 డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీజీఎంఎస్) ఎన్. నాగేశ్వరరావు అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా స్థాయి 23వ త్రైపాక్షిక రక్షణ కమిటీ సమావేశం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా అధ్యక్షతన శనివారం సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై సమావేశాన్ని ప్రారంభించారు. గత ఏడాది మరణించిన ఉద్యోగులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ, భద్రతపై ఎల్లప్పుడూ నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. పని ప్రదేశాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదరహిత సింగంణి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగులు భద్రతతో కూడిన పనులు చేపట్టాలన్నారు. డీజీఎంఎస్ సూచనలు, సలహాలను పాటించి, ప్రమాదాలు జరుగ కుండా చూసుకోవాల న్నారు. ఉద్యోగులు, అధికారులు తప్పకుండా రక్షణ సూత్రాలను పాటించాలని చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల న్నారు. ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలను పాటిస్తూ బొగ్గు ఉత్పత్తికి కృషి చేస్తామ న్నారు. ప్రణాళిక ప్రకారం గనుల్లో రక్షణ చర్యలు చేపడతామని చెప్పారు. మహిళా ఉద్యోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా మాట్లాడుతూ రక్షణలో ఎప్పుడూ రాజీ పడవద్దని సూచించారు. అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ యాజమాన్యం తీసుకునే నిర్ణయాలకు సహకరిస్తామని, ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోవాలని సూచించారు. కార్పొరేట్ జీఎం(రక్షణ) చింతల శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) రఘుకుమార్, రెస్క్యూ విభాగం జీఎం శ్రీనివాస రెడ్డి రక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఎంఎస్(ఎలక్ట్రికల్) రాజ్ కుమార్, డీడీఎంఎస్(ఎలక్ట్రికల్) రాజీవ్ ఓం ప్రకాష్, కోమల్ చౌదరి, డీడీఎంఎస్(మెకానికల్) దిలీప్‌కుమార్, అనికేత్‌సింగ్, డీడీఎంఎస్(మైనింగ్) కె. ప్రేమ్‌కుమార్, శ్రీరాంపూర్ ఏరియా సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ ఎప్పుడు?


ఇన్‌చార్జి జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు(ఫైల్)

మందమర్రిటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగ క్రీడాకారులకు క్రీడా సామగ్రి, దుస్తులు అందక రెండేళ్లకు పైగా కావస్తోంది. దీంతో ఎప్పుడు సామగ్రి పంపిణీ చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. 11 ఏరియాల్లో క్రీడా సామగ్రి ఇవ్వకపోవడంతో చాలా మంది క్రీడాకారులు వారి వారి క్రీడల పట్ల అనాసక్తి చూపుతున్నారు. అన్ని ఏరియాల్లో వార్షిక క్రీడలు ముగిసిన వెంటనే క్రీడా సామగ్రి పంపిణీ చేయాల్సి ఉండగా ఎందుకు జాప్యం జరుగుతుందనే విషయంపై క్రీడాకారులు కూడా ఆవేదన చెందుతున్నారు. సామగ్రి లేకపోవడంతో క్రీడల సాధన చేయలేకపోతున్నామని క్రీడాకారులు చెబుతున్నారు. అలాగే క్రీడా దుస్తులు అందజేయకపోవడం కూడా సరైంది కాదని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. కోలిండియాలో సైతం క్రీడాకారులు బహుమతులు సాధిస్తున్నారు. గడిచి న రెండేళ్లలో హాకీలో, బాడీబిల్డింగ్, పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు సాధించారు. అన్ని కార్మిక సంఘాలు కూడా క్రీడాభివృద్ధికి యాజమాన్యం కృషి చేయాలని కోరుతు న్నారు. ఇటీవల ఐఎన్‌టీయూసీ యూనియన్ క్రీడాకా రులకు సామగ్రి, క్రీడా దుస్తులు ఇవ్వాలని మందమర్రి ఇన్‌చార్జి జీఎం విజయ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అంద జేసింది. యూనియన్ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్యలు, రాంశెట్టినరేందర్ మాట్లాడుతూ క్రీడా సామగ్రి అందని విషయాన్ని యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌తో కలిసి సీఎండీకి విన్నవించనున్నట్లు తెలిపారు.

సింగరేణి సమాచారం

సింగరేణి పరిరక్షణకు కలిసిరావాలి


మాట్లాడుతున్న బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు కార్మికులు కలిసిరావాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి కోరారు. ఆర్కే 5 గనిపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థలో గతంలో 1.3 లక్షల ఉద్యోగులతో 30 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశామని అన్నారు. ప్రస్తుతం 39 వేల ఉద్యోగులతో 70 మిలియన్ టన్నుల ఉత్పత్తిని తీస్తున్నట్లు చెప్పారు. కోల్ ఇండియాలో 6.5 లక్షల ఉద్యోగులుండగా, ఇప్పుడు 2 లక్షల ఉద్యోగులతో 800 మిలి యన్ టన్నుల బొగ్గును తీస్తున్నారన్నారు. ఉద్యోగుల సంఖ్య తగ్గిపోగా, ఉత్పత్తి మాత్రం పెరిగిందని చెప్పారు. ఉద్యోగుల భద్రత, బొగ్గు పరిశ్ర మల భవిష్యత్తు, తదితర సమస్యలపై కార్మికులు, ప్రజలతో కలిసి ఉద్య మాలు చేపడతామని చెప్పారు. శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నా తాడి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కేంద్ర కార్యదర్శి మాదాసు రవీందర్, కోశాధికారి ఆకుల శ్రీహరి, శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, కోశాధికారి గూడ శ్రీకాంత్, పిట్ కార్యదర్శి రామకృష్ణ, సహాయ పిట్ కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన అధికారులకు సన్మానం

మందమర్రిటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పదోన్నతి పొందిన అధికారులను శనివారం సన్మానించారు. కేకే 5 గనిలో సీనియర్ అండర్ మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీధర్ పదోన్నతిపై బెల్లంపల్లి సెక్యూరిటీ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. జనరల్ అసిస్టెంట్ సాయి అండర్ మేనే జర్‌గా పదోన్నతి సాధించారు. ఈ మేరకు వీరిని గనిపై అధికారులు, కార్మిక సంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో గని మేనేజర్ శంభునాథ్ పాండే, నాయకులు కంది శ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు.

పోడు సమస్య పరిష్కరించాలని సీఎంకు వినతి



ఎమ్మెల్యే వినోద్‌తో కలిసి సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న హరీష్‌గౌడ్

నెన్నెల, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పోడు భూముల సమస్య పరిష్కరించాలని, మండలంలో రోడ్లు, వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి మండల కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. శనివారం హైదరాబాదులో ఎమ్మెల్యే వినోద్‌తో కలిసి మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్ సీఎంను కలిశారు. పోడు భూముల్లో సాగులో ఉన్న నిరుపేదలను అటవిశాఖ వారు ఇబ్బందులు పెడుతున్నారని, అటవి మార్గాల్లో రోడ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. కుమ్మరివాగుపై కొత్త వంతెనకు, కర్జీవాగుపై, ఎల్లమ్మగుడి వద్ద వాగులో బ్రిడ్జీలకు, కొత్తగూడెం నుంచి ఎల్లారానికి రోడ్డు, నెన్నెల నుంచి ఆవడం వరకు డబుల్ రోడ్డుకు, కుమ్మరివాగు ప్రాజెక్టులో, కాలువల్లో పూడిక తీతకు నిధులు మంజూరు చేయాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించారని నాయకులు పేర్కొన్నారు.

విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకోవాలి



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న డీఈవో యాదయ్య

చెన్నూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని డీఈవో యాదయ్య అన్నారు. శనివారం మండలంలోని కిష్టంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో దివంగత కోలకొండ సరోజినిదేవి-వెంకటనర్సిం హారావుల జ్ఞాపకార్థం వారి కుమారుడు సుబ్బారావు విద్యార్థులకు బ్యాగు లు పంపిణీ చేయగా డీఈవో కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాధాకృష్ణమూర్తి, హెచ్ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో భువన్ సర్వే



- యాప్‌లో ఇళ్ల విస్తీర్ణం నమోదు చేస్తున్న అధికారులు
- విస్తీర్ణం ఆధారంగానే పన్ను మదింపు
- మున్సిపాలిటిలోని ప్రతీ ఇంటికి జియోట్యాగింగ్

బెల్లంపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపాలిటీల్లో ప్రతీ ఇంటిని జియో ట్యాగింగ్ చేసేందుకు అధికారులు భువన్ సర్వే చేపడుతున్నారు. సర్వేలో భాగంగా సంబంధిత అధికారులు ప్రతీ అంశాన్ని నమోదు చేస్తున్నారు. మున్సిపాలిటీలోని ఆస్తుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసేందుకు భువన్ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది పర్యటించి ఇంటి ఆస్తుల వివరాలు నమోదు చేసి దాని ప్రకారం పన్నులు విధించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలోని మున్సిపాలిటీల్లో భువన్ సర్వే...

జిల్లావ్యాప్తంగా మున్సిపాలిటీలో అధికారులు భువన్ సర్వే చేపడుతున్నారు. జిల్లాలో బెల్లంపల్లి, మంచిర్యాల, మందమర్రి, లక్షెట్టిపేట, చెన్నూర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 14,795 ఇంటి నిర్మాణాలు ఉన్నాయి. మంచిర్యాలలో 21,627, లక్షెట్టిపేటలో 5,969, చెన్నూర్‌లో 6,735, క్యాతన్‌పల్లిలో 8,896, మందమర్రిలో 13,850 గృహాలు ఉన్నాయి. ఇందులో చాలా వరకు కొందరు ఇంటి నిర్మాణ యజమానులు అనుమతి ఒక ఫ్లోర్‌కు తీసుకుని రెండు ఫ్లోర్లు నిర్మించినవి ఉన్నాయి. అలాగే పలువురు అనుమతి లేకుండా ఇంటి నిర్మాణాలు సైతం చేపట్టారు. మరికొన్ని మున్సిపాలిటీల్లో ఇంటి నిర్మాణాలు లేనప్పటికీ అక్రమంగా మున్సిపాలిటిలో ఇంటి నంబర్లను కేటాయించుకున్నారు. ఇలా పలు విధాలుగా నిబంధనల ఉల్లంఘనతో మున్సిపాలిటీల ఆదాయానికి గండి పడుతోంది. ఉల్లంఘనలను చెక్‌పెట్టడానికి ఆస్తుల వివరాలను పక్కాగా నమోదు చేపట్టడానికి మూడేళ్ల క్రితం మున్సిపల్ శాఖ భువన్ సర్వేను ప్రారంభించింది.

ఎన్నికలు రావడం, వివిధ కారణాలతో భువన్ సర్వేను అర్థాంతరంగా నిలిపివేశారు. మళ్లీ ప్రభుత్వం భువన్ సర్వేను పునః ప్రారంభించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా సంబంధిత అధికారులు, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులను భువన్ యాప్‌లో నమోదు చేస్తు న్నారు. ప్రతీ నివాస భవనం, స్థలం కొలతలు తీసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి జియోట్యాగింగ్ చేస్తున్నారు. ఆస్తులకు సంబంధించిన ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి తీసుకొన్న పర్మిషన్ వాస్తవ నిర్మాణానికి తేడా ఉంటే వెంటనే సరిచేసి ఆన్‌లైన్‌లో ఖచ్చితమైన వివరాలను నమోదు చేస్తున్నారు.

ఆస్తి పన్నులో పారదర్శకత...

మున్సిపాలిటీలో భువన్ సర్వే చేపడుతుండడంతో ఆస్తి పన్ను పారదర్శకంగా జరుగనుంది. ఆస్తి పన్ను లెక్కింపులు అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు మున్సిపాలిటీలో వాణిజ్య భవనాలను నివాస గృహాలుగా చూపి పన్ను తగ్గించుకుంటున్నారు. రెండు మూడు ఫ్లోర్‌లు నిర్మించి ఒక ఫ్లోర్‌కే ఆస్తి పన్ను చెల్లిస్తున్నారన్న దాఖలాలు కోకొల్లలు ఉన్నాయి.

గతంలో ఇంటి నంబర్లు నమోదు చేసే సమయంలో పన్ను విధించారు. ఎన్నో ఏళ్లుగా వాటి ఆధారంగా ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు. అదనపు అంతస్తులు నిర్మించినా ఆస్తి పన్ను పెంచ లేదు. భువన్ సర్వే యాప్ పేరుతో అన్ని మున్సి పాలిటీల్లో భవన వివరాలను సేకరించి నమోదు చేసు కున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పెంచిన ఆస్తి పన్ను వసూలు చేయనున్నారు. దీంతో మున్సి పాలిటీలకు అదనపు ఆదాయం సమకూరనుంది. మున్సిపాలిటీలో పెరగనున్న ఆదాయంతో అభివృద్ధి పనులకు కొంత ఊరట లభించనుంది.



బెల్లంపల్లి మున్సిపాలిటీలో అధికారులు సర్వే

పకడ్బందీగా సర్వే చేస్తున్నాం..: తన్నీరు రమేశ్, మున్సిపల్ కమిషనర్ బెల్లంపల్లి



మున్సిపాలిటీలో భువన్ సర్వేలో భాగంగా ప్రతీ ఇంటిని కొలతలు చేపట్టి గృహాల ఫొటోలను, లొకేషన్ తదితర వివరాలు భువన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తు న్నాం. సంబంధిత సిబ్బందితో ఇంటింటి సర్వే చేపట్టి పారదర్శకంగా వివరాలు సేకరిస్తున్నాం. దీంతో ఇంటి పన్ను విషయంలో అవకతవకలు జరిగే అవకాశం ఉండదు. మున్సి పాలిటీలకు సైతం ఆదాయం పెరుగుతుంది. దీంతో మున్సిపాలిటీలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలి



తెలంగాణ తల్లికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలక్రైం, జూలై26 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణతల్లి విగ్రహానికి బీసీ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారరు. రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి చట్టసభలో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు కర్రె లచ్చన్న, వెంకటయ్య, పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మంచిర్యాలక్రైం, జూలై26 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం లక్ష్మీనగర్ శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. డివిజనల్ మేనేజర్ సదాశివరెడ్డి, జనరల్ మేనేజర్ అరవిందరెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ నాగరాజు, ప్రిన్సిపాల్ అయూబ్, డీన్‌శ్యామ్‌లో, అధ్యాపకులు, విద్యార్థులు పాలొన్నారు.

పద్మశాలీలు రాజకీయాల్లో రాణించాలి



సభ్యులను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

జైపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీలు రాజకీయాల్లో రాణించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బాపు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో పద్మశాలి సంఘం నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడిగా వేముల మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా భూమన్న, ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లి తిరుపతి, ప్రచార కార్యదర్శి కార్యవర్గ సభ్యులుగా పలు గ్రామాల ప్రతి నిధులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు ఆవిడపు గణేష్, జైపూర్ సంఘం గౌరవాధ్యక్షుడు కర్న భూమన్న, సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్‌వో వాటర్ ప్లాంటు అందజేత

దండేపల్లి జూలై 26 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం తాళ్ళపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో 2006-06 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ 65వేల విలువ గల ఆర్‌వో వాటర్ ప్లాంటు అందజేసి ఔదార్యం చాటుకున్నారు. విద్యార్థులకు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న దృష్టి పూర్వ విద్యార్థులందరు కలిసి నూతన వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులచే శనివారం ఆర్‌వో వాటర్ ప్లాంటును ప్రారంభించారు. పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి సాయికిరణ్

జన్నారం, జూలై26 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలని లక్షెట్టిపేట సివిల్ జడ్జి కాసుమల్ల సాయికిరణ్ అన్నారు. శనివారం మండలంలోని ఇంధన్‌పల్లి గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలను ప్రతీ ఒక్కరు గౌరవించాలని నేరాలకు పాల్పడకుండా ఉండాలని చట్టంలో ఎలాంటి సెక్షన్‌లో ఉంటాయో తెలిసి ఉండాలని అన్నారు. నేరాలకు పాల్పడకుండా ప్రతీ ఒక్కరు ప్రతి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని అన్నారు. అనంతరం గ్రామస్థులు జడ్జీ సాయికిరణ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోము రెడ్డి సత్తన్న, ఉపాధ్యక్షులు నళినికాంత్, సీనియర్ న్యాయవాదులు ప్రేంకుమార్, పద్మ, తాజోద్దీన్, ఎస్ఐ అనూష, అటవీ రేంజ్ అధికారి శ్రీధరాచారితో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ సాధనకు యువత కదలి రావాలి

మంచిర్యాలక్రైం, జూలై26 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ సాధన కోసం యువత కదలిరావాలని బీసీ మేధావుల ఫోరం జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ శ్రీరామోజు కొండయ్య అన్నారు. మంచిర్యాల బీసీ సంఘాల ఆధ్వర్యంలో రిజర్వేషన్ డే సంబురాలను సీవి రామన్ పీజీ కళాశాలలో నిర్వహించారు.

బీసీ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో సామాజిక న్యాయ దిన సమావేశంలో వారు ప్రసంగించారు. సాహు మహారాజ్ బీసీల అభ్యున్నతికి 1902 జూలై 26న రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశ పెట్టారన్నారు. రిజర్వేషన్ విధానాన్ని బ్రిటీష్ వారు కూడ మొదటి సారిగా భారత దేశలో 1931లో కులగణన చేసి షెడ్యూల్డ్ కులాల వారికి విధానాన్ని అమలు చేశారని తెలిపారు.

బీసీల 42శాతం రిజర్వేషన్ చట్టాన్ని అడ్డుకోవడానికి స్వార్థపరులు అడ్డుకోవ డానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈసమావేశంలో కోఆర్డినేటర్ కను కుంట్ల మల్లయ్య, రిటైర్డ్ అదనపు జిల్లా జడ్జి రాజన్న, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చినుకు పడింది..చిత్తడయింది

గిరిజన గూడాల్లో రహదారి కష్టాలు

కాసిపేట, జూలై26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గూడాల్లోకి వెళ్లాలంటే నడక నరకప్రాయంగా మారింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దేవాపూర్ పంచాయతీ పరిధిలోని పెద్దపూర్, కొలాంగూడ, రొట్టేపల్లి పంచాయతీలోని పాత తిరుమలాపూర్, ముత్యంపల్లి పంచాయతీ పరిధిలోని గురువాపూర్ గిరిజన గూడాలకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర అవస్తలు పడుతున్నారు. సాధారణ వర్షాలకే రోడ్లన్ని చిత్తడిగా మారి కాలినడకన సైతం వెళ్లలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం గురువాపూర్‌కు రోడ్డు మంజూరైన స్థానిక అధికారపార్టీ నాయకుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. గత వారంలో గురువాపూర్ స్థానిక యువకులు శ్రమదానం చేసి రహదారిని మెరుగుపరుచుకున్నారు. అధికారులు స్పందించి గిరిజన గూడాల్లో రహదారి సౌకర్యాలు మెరుగు పరుచాలని స్థానిక గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గోత్రాల గూడెంలో గోసిలెన్నో..

భీమారం : మండలంలోని కాజీపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గోత్రాల గూడెంలో సరైన వసతులు లేక ప్రజలు గోసలు పడుతున్నారు. సుమారు 150 మంది ఉన్న ఈ గూడెంను అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు. ప్రజలు సమస్యలతో కాలం వెళ్లదీస్తున్నారు. తమ గూడెంలో రోడ్డు సౌకర్యం లేదని, తాగునీటి సౌకర్యాలు లేవని, కనీసం రాత్రి కరెంటు కూడా ఉండని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా అత్యవసరం అయితే కనీసం ఆటో కూడా రాకుండా రోడ్డంతా బురదమయంగా మారుతుందని పేర్కొంటున్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



పెద్దపూర్, కోలాంగూడలో చిత్తడిగా మారిన రహదారి

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం..

(5వ పేజీ తరువాయి)

తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనుండగా, అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రి జిల్లాకు ఇప్పటికే చేరింది. ఎంపీటీసీ ఎన్నికల కోసం గులాబీ, జడ్పీటీసీ పోలింగ్ కోసం తెలుపు రంగు బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేస్తున్నారు.

ఒక అభ్యర్థికి ఒకే నామినేషన్...

ఇంతకు పూర్వం ఒక అభ్యర్థి అనేక పదవుల కోసం పోటీపడే అవకాశం ఉండేది. ఇప్పుడు ఒక అభ్యర్థి ఒక్క పదవికే పోటీ చేయాలనే నిబంధనను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీంతో ఒక అభ్యర్థి ఒకేసారి జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవులకు పోటీ చేసే అవకాశం ఈసారి ఉండే అవకాశాలు లేవు. రాష్ట్రంలో రిజర్వేషన్ల అంశం ఇంకా తేలక పోయినా, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరిలో రూపొందించిన ఓటరు జాబితాకు తుది మెరుగులు పెట్టే పనుల్లో ప్రస్తుతం పంచాయతీ అధికారులు నిమగ్నమై ఉన్నారు. చనిపోయిన వారి పేర్లను తొలగించి, కొత్తగా నమోదైన ఓటర్లను జాబితాలో చేర్చే పనుల్లో బిజీగా ఉన్నారు. అయితే ఎన్నికల నాటికి కొత్తగా ఓటరు జాబితాలో నమోదు చేసుకొనే అవకాశం కూడా యువతకు కల్పించారు. అలాగే ఈసారి పంచాయతీ ఎన్నికల్లో నోటా విధానానికి ఈసీ శ్రీకారం చుడుతోంది. 2004 నుంచి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో అమలు చేస్తున్న నోటా ఇక మీదట స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అమలు చేయనున్నారు. ఈ మేరకు బ్యాలెట్ పేపర్లలో నోటాను ముద్రించనున్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

కాసిపేట, జూలై26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని అకాడమిక్ కమ్యూనిటీ మొబైలింగ్ (ఏసీ ఎంఓ)ఆఫీసర్ లక్ష్మణ్ అన్నారు. శనివారం మండలంలోని మద్దిమాడ, రాంపూర్, గిరిజన ప్రాథమిక పాఠశాలలతో పాటు దేవాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రణాళికబద్ధంగా చదువుకొని మంచి ఫలితాలను సాధించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విధులపట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తే శాఖపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం రొడ్డ గోపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

మందమర్రిటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మేడారం సమీపంలో గల హెల్త్ సబ్ సెంటర్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యుడు రాపాక రమేష్ మాట్లాడుతూ టీబీ వ్యాధి నివారణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్న వారిని 102 వాహనంలో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి మళ్లీ తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంఎల్‌హెచ్‌పీలు విష్ణుతేజ, భవానీ, అభిజ్ఞ, సిబ్బంది మధుబాబు, విజయ, సంధ్యారాణి, కవిత, శ్రీలత పాల్గొన్నారు.

కల్వర్టులను పరిశీలించిన అధికారులు

భీమిని, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖర్జీభీంపూర్, చెన్నాపూర్ గ్రామాల్లో వర్షాలకు కోతకు గురైన కల్వర్టులను జిల్లా పంచాయతీరాజ్ అధికారులు శనివారం పరిశీలించారు. మంచిర్యాల ఈఈ రామ్మోహన్ కల్వర్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న కల్వర్టుల వద్ద, కోతకు గురైన రోడ్ల వద్ద వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని ఆయన వెంట తాండూర్ డీఈ సంతోష్‌కుమార్, ఏఈ రాఘవేందర్‌లు ఉన్నారు.

డీఆర్‌డీవో పర్యటన

హాజీపూర్, జూలై26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి డీఆర్‌డీవో కిషన్ శనివారం సందర్శించారు. విద్యార్థుల పఠన నైపుణ్యాలను పరీక్షించి అభినందించారు. అనంతరం మొక్కలు నాటారు. హెడ్‌మాస్టర్ తుమ్మ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, ఏపీవో మల్లయ్యలు పాల్గొన్నారు.

వారసంతను పట్టించుకోని అధికారులు

తాండూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండల కేంద్రంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి శనివారం జరిగే వారసంత అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొండు బానేష్ పేర్కొన్నారు. శనివారం వారసంతను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ వారసంతకు జిల్లా నుంచే కాకుండా కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి వేలాది మంది వచ్చి వెళ్తుంటారని తెలిపారు. సంతలో షెడ్లు నిర్మించకపోవడంతో విక్రయదారులు వర్షంలోనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సంతలో సౌకర్యాలు కల్పించాలని, మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

కాసిపేట, జూలై26 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలందరూ సిద్ధంగా ఉండాలని బీజేపీ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లం తిరుపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలకు వర్క్‌షాపు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో అధిష్ఠానం నుంచి పోటీ చేసి విజయం సాధించే దిశగా కార్యకర్తలందరూ సమిష్టిగా పని చేయాలని సూచించారు. బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, మండల అధ్యక్షులు సూరం సంపత్, ప్రధాన కార్యదర్శులు దేవునూరి సంతోష్, రెడ్డి బాల్ రాజు, ప్రసన్న, కిరణ్, చారులత, రాంచందర్, విష్ణువర్ధన్, గుంపుల సదయ్య, అనిల్, నవీన్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు







నస్పూర్,బెల్లంపల్లి, కాసిపేట ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారులు

నస్పూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఫెర్టిలైజర్ షాపులు, గోదాంలను శనివారం వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. డీలర్ వద్ద ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. యూరియా, ఇతర ఎరువులను పట్టా దారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులను పరిశీలించి ఇవ్వాలని డీలర్లకు సూచించారు. వ్యవసాయేతర అవసరాలకు యూరియాను మళ్లించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని, అవసరం ఉన్నప్పుడే వాటిని రైతులు తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుతం 31.14 మెట్రిక్ యూరియా అందుబాటు ఉన్నదని చెప్పారు. మండల వ్యవసాయ శాఖ అధికారి మహేందర్, ఏఈవో తిరుపతి, నస్పూర్ ఏఎస్ఐ బషీరోద్దిన్ మహ్మద్, కానిస్టేబుల్ మల్లేష్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి : పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో శనివారం పోలీసు, రెవెన్యూ, వ్యవసాయశాఖ ఆధ్వ ర్యంలో తనిఖీ నిర్వహించారు. ఎరువుల స్టాక్ రిజిస్టార్ బిల్లుల బుక్కులను పరిశీలించారు. రైతులకు ఎరువులను అధిక విక్రయించవద్దని దుకాణాదారులకు సూచించారు. దుకాణాల్లో, గోదాంలోని నిల్వలను పరిశీలించారు. ఎవరైన అధిక ధరలకు విక్రయించిన, కృత్రిక కొరత సృష్టించిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కాసిపేట: ఎరువులను కృత్రిమ కొరత సృష్టించి డీలర్లు అధిక ధరలకు అమ్మితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ హెచ్చరించింది. శనివారం దేవాపూర్ కాసిపేట ఎస్ఐలు గంగారాం, ఆంజనేయులతో పాటు మండల వ్యవసాధికారి చల్ల ప్రభాకర్‌లు మండలంలోని దేవాపూర్, కోమటిచేను, ముత్యంపల్లి, కాసిపేట, ఎరువుల దుకాణాలు గోదాముల్లో తనిఖీలు చేపట్టారు. స్టాక్, ధరల పట్టికను దుకాణాల ముందు నోటీసు బోర్డుపై స్పష్టంగా రాయించాలన్నారు.

చెన్నూరు: మండలంలోని ఆస్నాద, కొమ్మెర, అంగ్రాజ్‌పల్లి గ్రామాల్లోని ఫెర్టిలైజర్ దుకాణాలను శనివారం టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిల్‌బిక్కులు, స్టాక్ రిజిష్టర్‌లను, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువుల అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం మండలంలో 110 టన్నుల యూరియా ఉందన్నారు. తహసీల్దార్ మల్లికార్జున్, సీఐ రవీందర్‌రావు, ఎస్ఐ సుబ్బారావు, ఏవో యామిని పాల్గొన్నారు.

భీమిని : మండలంలోని కేస్లాపూర్‌లో గల హెచ్ ఏసీఏ సెంటర్‌లోని ఎరువుల దుకాణాన్ని శనివారం టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు మండల తహసీల్దార్ బికర్ణదాస్, ఏవో యమునదుర్గ, ఎస్ఐ విజయ్‌కుమార్‌లు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బిల్ బిక్‌లు, స్టాకు రిజిష్టర్‌లను పరిశీలించడంతో పాటు గోదాంలోని యూరియా బస్తాలను, అమ్మకాలు జరుగుతున్న తీరును పరిశీలించారు.

ప్రతి ఎరువుల దుకాణం ముందు ధరలు, నిల్వల పట్టికలను ప్రదర్శించాలని పేర్కొన్నారు. పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

హాజీపూర్, జూలై26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హాజీపూర్ గ్రామ పంచాయతీలో శనివారం కేంద్ర బృందం పర్యటించింది. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2025 సర్వేలో భాగంగా గ్రామాన్ని సందర్శించారు. తడిచెత్త పొడి చెత్త నిర్వహణ తీరుపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య నిర్వహణ, మొక్కల సంరక్షణకు ఎలాంటి సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారో ఆరా తీశారు. ఈకార్యక్రమంలో బృందం అధికారులు నాగలక్ష్మీ, రాజు, నాగరాజు, రాజేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలక్రైం, జూలై26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని సెడ్యూల్డ్ కులాలు సంక్షేమ కళాశాల బాలికల వస తి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, నాణ్యత వసతి గృహ పరిసరాలను పరిశీలించి మెస్ కమిటీ సభ్యులతో రోజువారి ఆహారపట్టిక అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగు నీరు, విద్యుత్, మూత్రశాలలు అన్ని సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందిస్తుందన్నారు. ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నిత్యావసర సరుకులు వినియోగించాలని విద్యార్థులకు వేడి భోజనం, శుద్ధమైన తాగునీరు అందించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని వసతిగృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అధికారులు ఎప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. వసతి గృహంలో నెలకొన్న సమస్య ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకరావాలని వసతి గృహంలో నెలకొన్న నీటి సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకరాగా బోర్‌వెల్ మంజూరు చేసి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సాయికుంటలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అందులో సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధిశాఖ ఉప సం చాలకులు దుర్గాప్రసాద్, సహాయ సాంఘీక సంక్షేమ అధికారి రవీందర్, వసతిగృహ సంక్షేమ అధికారి చందన పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థులతో అల్పాహారం చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం..





- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- ఓటరు జాబితాకు తుది మెరుగులు
- మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
- సిద్ధంగా ఉండాలంటూ కలెక్టర్లకు సీఎం ఆదేశాలు
- త్వరలో ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు

మంచిర్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా సన్నద్ధమైంది. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి, ఆ తరువాత సర్పంచ్ ఎలక్షన్లు నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నిక లకు సంబంధించి ఎన్నికల కమిషన్ త్వరలో షెడ్యూల్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి లోక్‌సభ ఎలక్షన్లు ముగియగానే, స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం అయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, పాలనపై పట్టు సాధించేందుకు కొంత సమయం పట్టింది. గ్రామ పంచాయతీల పాలన గత సంవత్సరం జనవరిలో ముగియగా, జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పాలక వర్గాల పదవీకాలం జూలై మాసంతో ముగిసింది. దీంతో స్థానిక సంస్థల పాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లింది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఈసీ సిద్ధం కాగా ఎలక్షన్లకు సంబం ధించి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే పీవోలు, ఏపీవోలు, రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తి కాగా, శిక్షణ తరగతులు కూడా ముగిశాయి. మరోవైపు ఎన్నికల కు సిద్ధంగా ఉండాలంటూ సీఎం రేవంత్ కూడా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా అధికార యంత్రాంగం ఆ పనుల్లో నిమగ్నమైంది.

జిల్లాలో 613 గ్రామాలు..

స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జిల్లాలోని 613 గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. గతంలో మొత్తం 311 గ్రామ పంచాయతీలకు గాను హాజీపూర్ మండలంలోని ఐదు జీపీలను మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. దీంతో జీపీల సంఖ్య 306కు తగ్గింది. అయితే జైపూర్ మండలంలోని గోపాల్‌పూర్, కాసిపేట మండలంలోని వరిపేట, జన్నారం మండలంలోని చర్లపల్లి, మొర్రిగూడ గ్రామాలను పంచాయతీలు మార్చాలంటూ ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ విషయం పెండింగులో ఉండటంతో ప్రస్తుతం జీపీల సంఖ్య 306కు పరిమితం అయింది. జిల్లాలో రెండు పంచాయతీ డివిజన్లలో 16 మండలాలు ఉన్నాయి. ఎంపీటీసీ స్థానాలు 129 ఉన్నాయి. గతంలో 130 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మున్సిపల్ కార్పొరేషన్‌లో మూడు స్థానాలు విలీనం అయ్యాయి. కొత్తగా భీమిని, భీమారం మండలాల్లో అధనంగా రెండు స్థానాలను పెంచగా, మొత్తం ఎంపీటీసీ స్థానాల సంఖ్యకు 129కి చేరింది. అలాగే జడ్పీటీసీ స్థానాలు 16, ఎంపీపీ స్థానాలు 16 ఉన్నాయి. వీటికిగాను...

(తరువాయి 7లో)

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

నస్పూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ఎంపీసీ-10, 6వ తరగతి-10 అడ్మిషన్లు తీసుకుని విద్యార్థులు చేరాలని ప్రిన్సిపల్ మౌనిక ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 28వ తేదీన స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

దండేపల్లి : దండేపల్లి కస్తూర్బీగాంధీ బాలికల విద్యాలయంలో 6, 7వ తరగతితో పాటు ఇంటర్‌లో ఎంఎల్‌టీలో ఖాళీగా ఉన్న సీట్లకు బాలికలు ఈనెల 28 సోమవారం లోగా స్పాట్ అడ్మిషన్ పొందాలని కేజీబీవి విద్యాలయ ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 18 సీట్లు, 7వ తరగతిలో 4, ఇంటర్‌లో ఎంఎల్‌టీలో 29 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

లక్షెట్టిపేట, జులై 26(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో అతిధి అధ్యాపకుల కోసం దర ఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మహాత్మ సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్, తెలుగు, కెమిస్ట్రీ, ఫిజిక్స్, డైరీ సైన్స్, క్రాప్‌ప్రొడక్షన్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ అప్లికేషన్, కంప్యూటర్ సైన్స్‌లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30వ తేదీ లోపు నేరుగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టు పీజీలో 55శాతం మార్కులతో ఉత్తీ ర్ణులై ఉండాలని నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

సైనికుల త్యాగాలకు ప్రతీక కార్గిల్ దివస్



కార్గిల్ దివస్‌లో కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ, ఏసీపీ

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సైనికుల త్యాగాలకు ప్రతిబింబం కార్గిల్ దివస్ అని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్‌లతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సైనికులకు నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ 1999లో నేవి, ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ సమష్టిగా పోరాడి మన దేశ సరిహద్దులను కాపాడారని, ఆ సమయంలో పోరాడి అమరులైన సైనికుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. సైనికులు కంటిక రెప్పలా కాపాలాగా ఉంటూ దేశాన్ని కాపాడుతున్నారన్నారు. పోలీసులు, అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువులు పక్కదారి పడితే కఠిన చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి చత్రునాయక్

కోటపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసా యాధికారి చత్రు నాయక్ అన్నారు. శనివారం మండం లోని బబ్బెరచెల్క, పారుపల్లి, ఆల్గామ, జనగామ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను, గోదాములను ఏవో సాయికృష్ణరెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. డీలర్లకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా డీలర్లు ఎరువులను అధిక ధరలకు అమ్మినా, అలాగే ఇతర ప్రొడక్టులను లింక్ చేసి అమ్మినా చర్యలు తీసుకుంటా మన్నారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు కావాల్సిన ఎరువులను అందు బాటులో ఉంచాలన్నారు. ప్రతి పట్టాదారు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం కోటపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో యూరియా పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో చెన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బానోత్ ప్రసాద్, మండల వ్యవసాయా ధికారి సాయికృష్ణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, ఏఈవోలు రాజ్ కుమార్, వైష్ణవి, వసుధ, రమ్యలతో పాటు రైతులు పాల్గొన్నారు.

విడవకుండా.. జడి వాన..

- జిల్లాలో 15.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- ఓసీపీల్లో ముందుకు సాగని బొగ్గు ఉత్పత్తి



బెల్లంపల్లిలోని రెండోవార్డులో ఇళ్ల ముందు నిలిచిన వర్షపు నీరు

మంచిర్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్ర వారం రాత్రి నుంచి ఎడతెరపిలేని వర్షం కురు స్తోంది. దీంతో జన జీవనం అతలాకుతలమైంది. వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా వాతావరణ ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. ఉద్యోగాలు చేసేవారు, పాఠశాల విద్యార్థులు ఒకింత ఇ బ్బందులకు గురయ్యారు. జిల్లాలో గడిచిన 24 గంటల్లో 15.6 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. నెన్నెల మం డలంలో గరిష్ఠంగా 26.1 మి.మీ వర్షపాతం నమోదైంది. కోటపల్లి మండలంలో 24.9, బెల్లంపల్లి మండలంలో 23.8, భీమిని, కన్నెపల్లి మండలాల్లో 23.2, జైపూర్ మండలంలో 17.5 మి.మీ, చెన్నూరు మండలంలో 17.4, న స్పూర్‌లో 16.5, భీమారం మండలంలో 15.7, కాసిపేట మండలంలో 14.6, తాండూరు మండలంలో 14.1 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద..

వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువ నుంచి వరద కొనసాగుతూనే ఉన్నది. ప్రాజెక్టు గరిష్ఠ మట్టం 20.175 టీఎంసీలకు గాను ప్రస్తు తం 9.759 టీఎంసీల నీరు చేరింది. ప్రాజెక్టు లెవల్ 148. 00 మీటర్లకుగాను ప్రస్తుతం 143.47 మీటర్ల ఎత్తుకు నీరు చేరింది. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 5,266 క్యూసె క్కుల నీరు చేరుతుండగా, మొత్తం ఔట్ ఫ్లో 432 క్యూ సెక్కులు ఉంది. హైద్రాబాద్ మెట్రోపాలిటన్ వర్క్స్ కోసం 311 క్యూసెక్కుల నీటిని, ఎన్‌టీపీసీ అవసరాలకు 121 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఓసీపీల్లో ఉత్పత్తికి ఆటంకం...

ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లా లోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి ఏ రియాల్లోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తితో పాటు ఓవర్ బర్డెన్ తొలగింపునకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. గనుల్లో వర్షపు నీరు చేరడంతో భారీ విద్యుత్ మో టార్ల సహాయంతో నీటిని ఎత్తి పోస్తున్నారు. ఐదు రోజుల్లో రూ. 32.5 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తి, రూ. 10 కోట్ల విలువైన ఓవర్ బర్డెన్ తొలగింపు పనులు నిలిచి పోయాయి. వర్షాల కారణంగా ఓసీపీలు బురదమయంగా మారడంతో వాహనాలను పైన నిలిపి ఉంచారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షంలో పలువార్డులు జలమయమయ్యాయి. పట్టణంలోని రెండోవార్డులో భారీ వర్షం కారణంగా ఇళ్ల సమీ పంలో నీరు నిలిచింది. దీంతో వార్డు ప్రజలు బయటకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. వాహనదారులు వర్షం కార ణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వర్షానికి కూలిన ఇంటిపైకప్పు

మందమర్రిరూరల్: కురుస్తున్న వర్షాలకు మండలం లోని పొన్నారం గ్రామంలో తాటికొండ పోశయ్య ఇల్లు శనివారం మధ్యాహ్నం ఇంటిపైకప్పు కూలిపోయింది. పోశయ్య మంచిర్యాలలో ఉంటూ కూలీ పనులు చేసుకుం టున్నాడు. వర్షానికి ఇంటిపైకప్పు కూలిపోయింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరాడు.

జన్నారం: రెండు రోజులుగా మండలంలో వర్షం ఏక తాటిగా కురువడంతో లోతట్టు ప్రాంతాలన్ని జలమ యంగా మారాయి. ఎడ తెరిపి లేకుండా ముసురుతో కూడిన వర్షం కురువడంతో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశువుల కాపరులు గోదావరిలోకి వెళ్లకూడదని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి హెచ్చరించారు.

మందమర్రిటౌన్ : మందమర్రిలో శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కార్మెల్ స్కూల్‌నుంచి సీఐఎస్ఎఫ్ కాలనీ వరకు రోడ్డుపై వరద నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఎంపీటీసీ నుంచి కేకే 5 బంగ్లాస్ వరకున్న రోడ్లపై నీరు ప్రవహించింది. మూడవ జోన్‌ఏరియాలో నీరు నిలిచిపోయింది. కేకే ఓసీపీలో కొంత వరద నీరు చేరింది. వర్షంతో విధులకు వెళ్లే కార్మికులు విధులకు వెళ్లలేకపోయారు.



మందమర్రి మండలంలో కూలిన ఇంటి పై కప్పు

వార్డు సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండో వార్డు ఇందిరమ్మ కాలనీలోని వార్డు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వార్డు ప్రజలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో వార్డులో డ్రైనేజీలు లేకపోవడంతో మూడు రోజులుగా ఇండ్లలోకి నీరు చేరుతుందన్నారు. రహదారి మీద భారీగా నీరు నిల్వడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. భారీగా నీరు నిలుస్తుండడంతో దోమలు వ్యాప్తి చెందడంతో పాటు విషపురుగులు సంచరిస్తున్నాయన్నారు. వార్డు సమస్యలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్న ప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సమస్య పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం ముందు దర్నా చేస్తాన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి అనిత

దండేపల్లి జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రైతు సంపాదన స్థాయిని పెంచుతుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనిత అన్నారు. మామిడిపల్లి గ్రామాలోని సాగు చేస్తున్న ఆయిల్‌పామ్, మామిడి తోటలను శనివారం ఉద్యానవన క్లస్టర అధికారి సహజతో కలిసి ఆయిల్‌పామ్ తోటను సందర్శించి వారు పరిశీలించారు. ఆయిల్‌పామ్ సాగులో మెలకువలు పాటించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించి రైతులు మంచి లాభాలు పొందాలన్నారు. పంట సాగులో యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం గెల కోత సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయిల్‌పామ్ అంతర్ పంటలు సాగు చేసుకునే వెసులు బాటు ఉంటుందన్నారు. ఆయిల్ పామ్ పంటల సాగుకు ప్రభుత్వం అత్యధికంగా సబ్సిడీ అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కుర్చీల వితరణ

హాజీపూర్, జూలై26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొనబండ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు పది కుర్చీలను విరాళంగా అందజేశారు. 1991-92 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.20వేలు విలువ చేసే పది కుర్చీలను శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమాండ్లకు అందజేశారు. దాదాపు 30 ఏళ్ల కిందట పదోతరగతి పూర్తి చేసుకొని వివిధ రంగాల్లో స్థిరపడ్డా కాని గతంలో చదువుకున్న పాఠశాల పై మక్కువతో కుర్చీలు అందజేయడంపై పాఠశాల ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థుల సేవలను కొనియాడారు. పూర్వ విద్యార్థులు అంజయ్య, మల్లేశ్, చంద్రయ్య, సత్తయ్య, సత్యనారాయణ, మల్లేశ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన ఉండాలి



లక్షెట్టిపేట, మంచిర్యాలలో ఓటింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు,

లక్షెట్టిపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో బాధ్యతతో పాటు ప్రజాస్వామ్య బావాలను పెంపొందించాలనే ఉద్యేశంతో పాఠశాలలో కేబినేట్ ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ అశ్విని అన్నారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం స్కూల్ కేబినెట్ ఎన్నికలను వైభవంగా నిర్వహించారు. కెప్టెన్, వైస్ కెప్టెన్, జనరల్ సెక్రెటరీ, స్పోర్ట్స్ సెక్రెటరీ పదవులకు ఎన్నికలు నిర్వహించామన్నారు. జోనల్ ఏజీఎం అరవింద్‌రెడ్డి, కో ఆర్డినేటర్ నాగరాజు, అకాడమిక్ డీసీ సుధీర్, ప్రైమరీ ఇన్‌చార్జి శైలజ పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు మాక్ ఎలక్షన్‌లను నిర్వహించారు. సుమారు 800 మంది విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సంజీవ్, పాఠశాల డీన్ రవి పాల్గొన్నారు.